క్లుప్తంగా

ఓటు.. వజ్రాయుధం

- అర్హులందరూ వినియోగించుకోండి
- తహసీల్దార్ మురళీధర్



కామునిపల్లిలో ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మురళీధర్

కుల్కచర్ల: అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ మురళీధర్ కోరారు. శుక్రవారం మండల పరిధి కామునిపల్లి గ్రామంలో ఓటరు స్లిప్పులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు అనేది వజ్రాయుధం వంటిదని, తమ విలువైన ఓటును వేసి, సమర్థవంతమైన నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు. ఓటరు స్లిప్పులు రానివారు ఎవరైనా ఉంటే.. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని చెప్పారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి: కేఎస్ఆర్



టోర్నీ ప్రారంభిస్తున్న శరత్‌కుమార్ రెడ్డి

దోమ: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడడమే కాకుండా వ్యక్తుల మధ్య ప్రేమానురాగాలను పెంచుతుందని కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి పాలేపల్లి గ్రామంలో పాలేపల్లి క్రికెట్ లీగ్ టోర్నీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, ఆటల్లో ప్రతిభ చూపాలని సూచించారు. గెలిచిన వారు ఓడిన వారిని హేళన చేయకుండా.. స్నేహపూర్వకంగా మెలగాలని చెప్పారు. చదువుతో పాటు ఆటలు ముఖ్యమేనని, టోర్నీలు నిర్వహించుకుంటే తమవంతు సహకారం అందజేస్తామని నిర్వాహకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు లక్ష్మణ్, గోవర్ధన్, మణికంఠ, శ్రీనివాస్, శ్రీకాంత్, అంజి, దస్తయ్య, ఫారుక్, నర్సింలు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

రంజిత్ గెలిస్తే మరింత అభివృద్ధి



ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నేతలు

కొడంగల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. మండల పరిధి పలు గ్రామాల్లో పర్యటించి పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారని, కేంద్రంలో పార్టీ గెలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని ఈ సందర్భంగా ఓటర్లకు వివరించారు. ఇందులో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏన్గుల భాస్కర్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, నాయకులు నయీమ్, ఆసిఫ్‌ఖాన్, దాము, మురహరి వశిష్ట తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: మండల పరిధి ఐనెల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మల్కాపూర్‌లో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఐనెల్లికి చెందిన సీనియర్ నాయకుడిజీ హరీశ్వర్‌రెడ్డి సమక్షంలో మాజీ ఉప సర్పంచ్‌తో పాటు రమేష్, ఆశప్ప భీంరావు, గౌస్ తదితరులు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి ఎంపీ, ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.



బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేంధర్‌రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఇందులో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు.

– తాండూరు రూరల్



నంది ఘాట్ మలుపులో రోడ్డుపై గుంతలు (ఫైల్)



మొరంమట్టితో గుంతలు పూడ్చిన ప్రదేశం

గుంతలు పోయి.. మొరం వచ్చె..

- 'ఘాటు'రోడ్డు ప్యాచ్ పనుల్లో నిర్లక్ష్యం
- మట్టిపోసి గోతులు పూడ్చిన వైనం
- ప్రమాదాల బారిన వాహనచోదకులు

ధారూరు: పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన అనంతగిరి గుట్ట రహదారులు పర్యాటకులకు చుక్కలు చూపెడుతున్నాయి. అసలే భారీ మూలమలుపులు, ఆపై గుంతలు ఏర్పడిన రోడ్లలో బిక్కుబిక్కుమంటూ వాహనచోదకులు పయనిస్తున్న నేపథ్యాన్ని ఈ నెల 17న 'ప్రమాదాల ఘాటు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన వార్తా కథనానికి రోడ్లు, భవనాలశాఖ అధికారులు స్పందించి, గోతులు పూడ్పించారు. కానీ.. వారు చేసిన మరమ్మతు పనులు చూసి ప్రజలు నివ్వెర పోతున్నారు. ఘాట్ రోడ్డులో కిలో దూరంలో పలుచోట్ల ఏర్పడిన గుంతలను కంకర, డాంబర్‌తో పూడ్పించాల్సింది పోయి.. మొరం పోసి చేతులు దులుపుకొన్న వైనం.. నవ్విపోదురు గాక నాకేమి సిగ్గన్నట్లుగా ఉంది అధికారుల పని తీరు అని ఎద్దేవా చేస్తున్నారు. అంతకు ముందు ఉన్న దానికంటే.. మరమ్మతు పేరిట చేసిన పనులే ప్రయాణికులకు మరింత ఇబ్బందికరంగా మారాయని వాపోతున్నారు. అంతకు ముందు గుంతలే అనుకుంటే.. ఇప్పుడు మొరం పోసిన రోడ్డుతో.. ముందు వెళ్తున్న వాహనాలతో వెనకాల వచ్చే వారి కళ్లల్లో దుమ్ముధూళి పడి ప్రమాదాలకు దారి తీస్తుందని, వాహనాలు పట్టు కోల్పోతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

మరమ్మతు పనుల్లో నిర్లక్ష్యం

కంకరమట్టి పోసి, దానిపై 20 ఎంఎం కంకరలో డాంబర్ కలిపి గుంతలు పూడ్చాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అధికారుల ఆ నిబంధనలేమీ పాటించలేదు. కంటితుడుపు చర్యగా పనులు చేసి, మమ అనిపించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన ప్రాంతంలో అధికారులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించి, ప్రజాధనం దుర్వినియోగం చేయడమే కాకుండా.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శిస్తున్నారు. కొత్త రోడ్డు వేయకున్నా.. కనీసం మరమ్మతు పనులైనా పటిష్టంగా ఉండేలా చేయించాలని కోరుతున్నారు.

నేటి నుంచి బీరప్ప జాతర

మోమిన్‌పేట: మండల పరిధి వెల్‌చాల్ గ్రామంలో శనివారం నుంచి బుధవారం వరకు కామరతి, బీరప్ప జాతర మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం పోచమ్మకు బోనాలు, మైలలు తీయుట, ఆదివారం బీరప్పకు బోనాలు, అన్నదానం, సోమవారం కామరతి బీరప్ప కల్యాణం, మంగళవారం నాగవెల్లి బోనాలు, ఒగ్గుకథ, బుధవారం వివిధ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

30న మందకృష్ణ రాక

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 30న వికారాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి సమావేశానికి మందకృష్ణ మాదిక రానున్నారని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీకి మాదిగ, మాదిగ ఉపకులాలు మద్దతుగా నిలిచి, ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా నిర్వహించే సమీక్షకు సంస్థ అధినేత మందకృష్ణ రానున్నారని పేర్కొన్నారు. కావున ఈ సమీక్షలో అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొనాలని కోరారు. ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు, అనంతయ్య, ఆనంద్, సాయి, మాణిక్యం ఉన్నారు.

రంజిత్‌ను ఆశీర్వదించండి..

ఎంపీ సతీమణి సీతారెడ్డి



ప్రచారం చేస్తున్న రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి

అనంతగిరి: నా భర్తను మరోసారి ఆశీర్వదించి, పార్లమెంటుకు పంపాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి కోరారు. లోకసభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం వికారాబాద్ పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డితో కలిసి వేరువేరుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడే రంజిత్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండాలని సీత కోరారు. పార్లమెంటు ఎన్నికల్లో ఓటు వేసి ప్రాంత అభివృద్ధిని ఆస్వాదించాలన్నారు. ఆమె వెంట ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, కౌన్సిలర్లు మాలె గాయత్రి, మోముల స్వాతి, మురళి, దేవి, మహిళా నాయకురాళ్లు పల్లవి, మేఘమాల, అర్చన తదితరులు పాల్గొన్నారు.

'కొండా' అభివృద్ధే కనిపిస్తోంది

- ఎంపీ రంజిత్‌రెడ్డి చేసిందేమీ లేదు
- ఇంటింటి ప్రచారంలో బీజేపీ శ్రేణులు
- మోదీ హ్యాట్రిక్ విజయం ఖాయమంటూ ధీమా



పెద్దేముల్: రుక్మాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్



ప్రచారం చేస్తున్న బీజేపీ శ్రేణులు



చౌడాపూర్‌లో.. ప్రచారం చేస్తున్న కమలనాథులు

మోమిన్‌పేట: గ్రామాల్లో ఇప్పటికీ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేసిన అభివృద్ధే కన్పిస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి అంరాధికుర్దు, అంరాధికలాన్ గ్రామాల్లో ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండాకు మద్దతుగా పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు నియోజకవర్గ పరిధి గ్రామాల్లో కొండా చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని, ఎంపీ రంజిత్‌రెడ్డి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని, పదేళ్ల బీజేపీ పాలనలో ఒక్క స్కాం జరగలేదని వెల్లడించారు. కాంగ్రెస్ హయాంలో దేశం అధోగతి పాలయిందని ఆరోపించారు. మోదీ పాలనలో దేశం ప్రశాంతంగా ఉందని, మరోసారి ఆయనే ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే వృథానే అని, కావున ప్రతి ఒక్కరూ కొండాకు ఓటువేసి, చేవెళ్లను ప్రధానికి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మహిపాల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు అశిరెడ్డి, మండల నాయకులు రాఘవేందర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజశేఖర సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే సుభిక్ష పాలన

కుల్కచర్ల: బీజేపీతోనే దేశంలో సుభిక్ష పాలన కొనసాగుతుందని ఆ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య అన్నారు. మండల పరిధి పలు గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీజేపీ కాకుండా ఇతర పార్టీలు అధికారంలో ఉంటే.. ఉగ్రదాడులు, అవినీతి స్కాంలతో దేశం అట్టుడికి పోయేదని పేర్కొన్నారు. మోదీ నేతృత్వంలో దేశ ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని, అందుకని పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌ను గెలిపించి, చేవెళ్లను మోదీకి కానుకగా ఇద్దామని చెప్పారు. ఇందులో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఎస్సీమోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, బీజేవైఎం మండల అధ్యక్షుడు శరత్ కుమార్, నాయకులు కటికె నర్సోజీ, కావలి నరేష్, సింగరమోని శ్రీను, రమేష్, నవీన్, రమేష్, చెన్నయ్య, వెంకటేశ్, సోమయ్య, శరత్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పట్లోళ్ల ఆధ్వర్యంలో..

మండల పరిధి గ్రామాల్లో బీజేపీ మహిళామోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సామ్యారెడ్డి ఆధ్వర్యంలో ఇంటి ప్రచారం చేశారు. ఇందులో భాగంగా ఉపాధి పనుల ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. లోక్‌సభ ఎన్నికల్లో 'కొండా'కు మద్దతునిచ్చి, మోదీని బలపర్చాలని కోరారు. ఇందులో మైపాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే.. మళ్లీ మోదీ రావాలె..

ధారూరు: దేశం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి మోదీ ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం మండల పరిధి ఎబ్బనూర్, బాచారం గ్రామాల్లో ఆ పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడారు. లోకసభ ఎన్నికల్లో పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటు వేసి, చేవెళ్లను ప్రధాని మోదీకి కానుకగా ఇవ్వాలని ఓటర్లను కోరారు. ఇందులో పార్టీ సీనియర్ నాయకులు పాండుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు ఎం.రమేశ్, నాయకులు రాజునాయక్, వడ్లనందు, సుచరితారెడ్డి, కృష్ణ, సాయిగౌడ్, విజయలక్ష్మి, రాఘవేందర్‌గౌడ్, నెల్లి విశ్వనాథం, అనిల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వవిద్యార్థులతో నాటి ఉపాధ్యాయులు

దోమ: రెండు దశాబ్దాల అనంతరం నాటి బాల్యమిత్రులు ఒకే వేదికగా సందడి చేశారు. చిలిపి పనులు గుర్తుచేసుకుంటూ కేరింతలు కొట్టారు. మండల కేంద్రం జిల్లా పరిషత్ పాఠశాలలో 2000–01 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ, ఆత్మీయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడారు. తమకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించడం వల్లే.. వివిధ రంగాల్లో స్థిరపడ్డామని పేర్కొన్నారు. ఇందులో నాటి ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, ప్రమోద్ రెడ్డి, గోవింద్, శ్రీనివాస్, గీతారెడ్డి, భ్రమరాంబ, హుస్సేన్, శివశంకర్, విద్యార్థులు ఉన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయండి

గ్రామ పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కేశంపేట: లేబర్ కోడ్లను రద్దు చేసి, 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని గ్రామ పంచాయతీ కార్మిక, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మేడేను పురస్కరించుకొని పంచాయతీ కార్మికులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, గ్రామ పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్మికుల శ్రేయస్సుకోసం సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు రూ. 10లక్షల ప్రమాదబీమా ప్రకటించాలని, డీజిల్, పెట్రోల్‌లను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని వెల్లడించారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గించాలన్నారు. జీపీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, రవి, యాదయ్య, నరసింహ, స్వాతి, సురేశ్, నారాయణ, లింగమయ్య తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ కష్టాలు గట్టెక్కేదెన్నడో?

- రోడ్లపైనే వాహనాల నిలిపివేత
- ఇబ్బంది పడుతున్న పాదచారులు

పరిగి: పట్టణంలో పార్కింగ్ సమస్య తీవ్రమైంది. జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలను ఇష్టంగా నిలపడంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పట్టణానికి నిత్యం వివిధ పనుల నిమిత్తం నియోజకవర్గ పరిధి గ్రామాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుండగా.. ప్రధాన మార్కెట్లన్నీ క్రయవిక్రయదారులతో కిటకిటలాడుతుంటాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది.

బస్టాండ్ నుంచి చౌరస్తా వరకు

బస్టాండ్ నుంచి కొడంగల్ చౌరస్తా వరకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా బస్టాండ్ దగ్గర మొబైల్ దుకాణాలు అధికంగా ఉండటంతో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. అక్కడ పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డు పక్కనే వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. బహార్‌పేట్‌లోనూ ఇదే తంతు. సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉదయం, సాయంత్రం వేళలో స్థానికులను ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతుండగా.. ఈ కష్టాలు గట్టెక్కేదెన్నడో అని ప్రజలు వాపోతున్నారు.

ఆ రెండు రోజులు నరకమే..

పట్టణంలో వారానికి రెండు రోజులు శుక్ర, శనివారాల్లో సంత జరుగుతుంది. ఇక్కడికి అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. పశువుల కొనుగోలు నిమిత్తం, మార్కెట్‌కు ధాన్యం విక్రయించేందుకు రైతులు వస్తుంటారు. సంత గంజ్‌రోడ్డులో ఉండటం, అన్ని రకాల వ్యాపారాలు ఇక్కడే కొనసాగుతుంటాయి. దీంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి.



బస్టాండ్ వద్ద రోడ్డుపక్కన నిలిపిన వాహనాలు

ట్రాఫిక్ స్థలం ఏర్పాటు చేయండి



జాతీయ రహదారి కావడంతో వాహనాల రద్దీ సహజంగానే ఎక్కువగా ఉటుంది. దీనికి తోడు వారానికి రెండుసార్లు సంత జరుగుతుంది. దీంతో ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయి. దీనికి తోడు వాహనాల వేగం అధికంగా ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పోలీసులు చొరవ తీసుకుని, ట్రాఫిక్ స్థలం ఏర్పాటు చేసి, సమస్యను పరిష్కరించాలి.

– మల్లేశ్, మిట్టకోడూర్, పరిగి

తాగునీటిపై నివేదిక ఇవ్వండి

పెద్దేముల్: తాగునీటి ఎద్దడి నెలకొన్న రాంసింగ్ తండాను సందర్శించి, అక్కడి సమస్యపై తగిన నివేదిక అందజేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి శుక్రవారం డీపీఓ జయసుధకు ఆదేశాలు జారీ చేశారు. తండా లో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై ఇటీవల 'గుక్కెడు.. మహాప్రభో' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే తాజాగా డీపీఓకు తగి న సమాచారం సమర్పించాలని ఆదేశాలు ఇచ్చారు.

కాంగ్రెస్ హయాంలోనే దేశం అభివృద్ధి

- పేదలను నిరుపేదలుగా మారుస్తున్న మోదీ
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

బంట్వారం: కాంగ్రెస్ హయాంలోనే దేశం అభివృద్ధి చెందిందని, ప్రధాని మోదీ పేదలను నిరుపేదలుగా మారుస్తున్నారని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి బట్వారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగియగానే కాంగ్రెస్ మేనిఫెస్టోలోని ఎన్నికల హామీలను అమలు చేస్తామని చెప్పారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం దోచుకోవడం తప్పా రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమీ లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఆదరించి, భారీ మెజార్టీతో గెలిపిస్తే చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని దేశంలోనే నంబర్1గా తీర్చిదిద్దుతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో బంట్వారం, కోట్‌పల్లి మండల అధ్యక్షులు వెంకటేశం, నర్సింగ్ నాయక్, ఎంపీపీ ప్రభాకర్, జెడ్పీటీసీ సంతోష, స్పీకర్ తనయ అనన్య చేతన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



ధారూరులో.. స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

పలు వివాహ వేడుకల్లో ప్రజాప్రతినిధులు ఆకర్షణగా నిలిచారు. ధారూరు మండల కేంద్రంలో మాజీ ఎంపీటీసీ బోయిని అంజయ్య సోదరుడి కుమారుడి వివాహం, లోహోలా స్కూల్ ప్రిన్సిపాల్ జగదీష్‌చారి, గట్టెపల్లి గ్రామానికి చెందిన దేశ్‌ముఖ్ చంద్మాంత్, నాగసమందర్ గ్రామానికి చెందిన వినోద్‌కుమార్, ప్రవీణ్ వివాహంతో పాటు, కేరెల్లి గ్రామానికి చెందిన కుర్వమల్లయ్య నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ హాజరయ్యారు. కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామంలో సత్యనారాయణ కూతురు వివాహ వేడుకల్లో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఎమ్మెల్యేలు ఆశీర్వదించారు.

– ధారూరు/కుల్కచర్ల



కుల్కచర్లలో.. ఎమ్మెల్యే బీఎమ్మార్